క్లుప్తంగా

పోలీసు విధులపై అవగాహన



శావల్యాపురం: స్థానిక పోలీసు స్టేషనులో జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం గురువారం నిర్వహించినట్లు ఎస్సై లేళ్ల లోకేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. పోలీసు వారు ఉపయోగించే ఆయుధాలు, పరికరాలు, విధులు వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్టేషను రైటరు షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర సహాయకుల సంఘం ఎన్నిక



నూజెండ్ల: నూజెండ్ల మండలం ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుల సంఘం మండల అధ్యక్షుడిగా పల్లపు గురవారావు, ఉపాధ్యక్షులుగా బోడపాటి నాగార్జున, కార్యదర్శిగా కొత్తపల్లి తిరుపతిరావు గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏపీవో ఆంజనేయరాజు ఘనంగా సత్కరించారు.

'చావా' ప్రదర్శన నిలుపుదలకు డిమాండ్

నాదెండ్ల: చావా సినిమా ప్రదర్శనను తెలుగు రాష్ట్రాల్లో నిలుపుదల చేయాలని ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజి ప్రభుత్వాన్ని కోరారు. తూబాడు గ్రామంలోని తన నివాసంలో గురువారం మీడియాతో మాట్లాడుతూ హిందువులను తప్పుదోవ పట్టించి ఇలాంటి సినిమాల ద్వారా రెచ్చగొడుతున్నారని వాపోయారు.

12న మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం

యడ్లపాడు: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 12వ తేదీన ఉంటుందని ఎంపీడీవో వి.హేమలతాదేవి తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ పిడతల ఝాన్సీ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. మండల అభివృద్ధి పనులపై సమీక్ష, ఎంపీపీ అనుమతితో ప్రజా ప్రయోజన అంశాలపై చర్చించనున్నట్లు వెల్లడించారు.

వినియోగదారులు హక్కులను తెలుసుకోవాలి



నరసరావుపేట: వినియోగదారులు తమ హక్కులకు భంగం కలిగితే పోరాటం చేసి వాటిని కాపాడుకోవాలని ఆంధ్రప్రదేశ్ వినియోగదారుల రక్షణ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కే తిరుపాల్ పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తర్వాత సభ్యులు ఆయన్ను సన్మానించారు. ఫోరం పల్నాడు జిల్లా అధ్యక్షులు చేగు వెంకటేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు కృష్ణకుమారి, జిల్లా కార్యదర్శి లాజర్, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

కారు ఢీ.. 6 గొర్రెలు మృతి

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు వద్ద శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్ వేపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 6 గొర్రెలు మృతి చెందాయి. ఒంగోలు వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు వాటిని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. రొంపిచర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాపర్ తీగల చోరీపై కేసు

నాదెండ్ల: చిలకలూరిపేట నూతన బైపాస్ రోడ్డులో సోలార్ కాపర్ తీగల చోరీ జరిగిందంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై జి. పుల్లారావు తెలిపిన వివరాల మేరకు.. ఫిబ్రవరి 8వ తేదీన బైపాస్ రోడ్డులో గణపవరం సమీపంలో రూ.2.20 లక్షల విలువైన 10 వేల మీటర్లు గల సోలార్ కాపర్ తీగ దొంగిలించారని ఫిర్యాదు అందింది. వి స్పార్కిల్ ఎండీ కల్లూరి నాగరాజు గురువారం ఈ మేరకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

చిలకలూరిపేట టౌన్: స్కూటీ అదుపుతప్పి వ్యక్తికి తీవ్రంగా గాయాలయ్యాయి. సేకరించిన వివరాల ప్రకారం...నాదెండ్ల మండలం గణపవరం గ్రామానికి చెందిన సీహెచ్ శ్రీనివాస్ నరసరావుపేటలో చికిత్స చేయించుకునే నిమిత్తం గురువారం తన స్కూటీపై సమీప బంధువుతో కలిసి బయలుదేరాడు. చిలకలూరిపేట మండలం కోమటినేని వారిపాలెం గ్రామం వద్ద రోడ్డుపై కుక్క అడ్డురావడంతో వేగంగా ఉన్న స్కూటీ అదుపుతప్పింది. శ్రీనివాస్ తలకు బలమైన గాయాలయ్యాయి.

ఎండు ఫలం... ఎంతో బలం

రంజాన్ నేపథ్యంలో డ్రైఫ్రూట్స్‌కు డిమాండ్



కిస్‌మిస్, తదితరాలు



సౌదీ ఖర్జూరం



బాదం పప్పు

చిలకలూరిపేట: పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు నెలరోజుల పాటు నియమ నిష్ఠలతో ఉపవాసం ఉండి, రోజుకు ఐదుసార్లు నమాజు చేస్తారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం దీక్ష విరమించేవరకు నీరు కూడా తాగరు. అలసట, నీరసం దరిచేరనీయకుండా డ్రైఫ్రూట్స్ వారికి ఎంతో ఉపయోగపడతాయి. దీంతో వీటి వినియోగం పెరిగింది. విక్రయాలు ఊపందుకున్నాయి.

ఎండు ఖర్జూరంతో మేలు...

డ్రైఫ్రూట్స్ ఎన్ని లభ్యమవుతున్నా ఖర్జూరానికి ముస్లింలు ప్రాధాన్యత ఇస్తారు. ఉపవాస దీక్ష అనంతరం ఎండు ఖర్జూరం, ఎండు ద్రాక్ష (కిస్‌మిస్), బాదం, పిస్తా, అంజూర్, జీడిపప్పు, ఆఫ్రికార్ట్స్ వంటి డ్రై ఫ్రూట్స్‌ను క్రమం తప్పకుండా తీసుకుంటే ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరం. ఇవి అత్యంత శక్తిని ఇవ్వటంతో పాటు ఉల్లాసంగా ఉండటానికి ఎంతగానో ఉపకరిస్తాయి.

ఔషధ గుణాలు...

ఎండిన ఫలాల్లో ఔషధ గుణాలు మెండుగా ఉంటాయి. వీటి వలన ఎలాంటి దుష్ఫలితాలు ఉండవు. శరీరానికి అవసరమైన ఖనిజాలు, విటమిన్లతోపాటు జీర్ణశక్తికి తోడ్పడి, రక్తాన్ని శుద్ధి చేస్తాయి. హృద్రోగాన్ని, క్యాన్సర్ వంటి వాటిని దరిచేరనీయవు. దీంతో మసీదుల సమీపంలో ప్రత్యేక దుకాణాల్లో ఈ డ్రైఫ్రూట్స్ దర్శనమిస్తున్నాయి.

ఇతర దేశాల నుంచి ....

ఒకప్పుడు రంజాన్ వేళల్లో బండ్లపై ఎక్కువగా వీటిని అమ్మేవారు. కొన్నేళ్లుగా ఎండుఫలాలు గుంటూరు నగరంతో పాటు చిలకలూరిపేట, నరసరావుపేట, తెనాలి వంటి పెద్ద పట్టణాల్లో ప్రత్యేక దుకాణాలు వెలిశాయి. ఈ ఎండు ఫలాలను ఢిల్లీ, ముంబయి తదితర ప్రాంతాల నుంచే కాక దుబాయి, షార్జా, సౌదీ అరేబియా, కువైట్ వంటి దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు.

ఆకర్షణీయమైన ప్యాకెట్లలో ...

ఎండు ఫలాలను ఆకర్షణీయ ప్యాకెట్లలో విక్రయిస్తున్నారు. స్వదేశీ వాటితో పాటు ఇతర దేశాల ఫలాలకు డిమాండ్ అధికంగానే ఉంది. కొనుగోలుదారుల సౌలభ్యం కోసం రూ.100 నుంచి రూ. 1000 వరకు విలువైన ప్యాకెట్లలో లభ్యం అవుతున్నాయి. వంద గ్రాముల ప్యాకెట్ల నుంచి ఐదు కేజీల గిఫ్ట్ ప్యాకెట్ల వరకు దొరుకుతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ధరలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

దాతల సహాయంతో....

పలు మసీదుల వద్ద, చిన్న దుకాణాలతోపాటు తోపుడు బండ్లపై ఎండు ఫలాలు విరివిరిగా విక్రయిస్తున్నారు. రంజాన్ ప్రత్యేకత ఏమంటే డబ్బు పెట్టి కొనలేని వారికి కూడా దాతలు ఇఫ్తార్ విందు సమయాల్లో ఉచితంగా ఈ ఫలాలను అందిస్తున్నారు. వీటిలో ఉండే పోషక విలువలు మనిషిని శక్తిమంతం చేస్తాయి. మాములు రోజుల కంటే రంజాన్ నెలలో డ్రైఫ్రూట్స్‌కు మంచి డిమాండ్ ఉంటుందని వ్యాపారులు చెప్పారు.

కూలీలు జాగ్రత్తలు పాటించాలి



ఈపూరు (శావల్యాపురం): వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ఉపాధి కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఉదయం 11 గంటలలోపు పనులు చేయించాలని జిల్లా ఉపాధి పీడీ మఠం సిద్ధా లింగమూర్తి అన్నారు. గురువారం ఈపూరు మండలంలోని ఈపూరు, అంగలూరు గ్రామాల్లో ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. వంద శాతం పనిదినాలు ఈ నెలాఖారులోగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించి కూలీల మస్టర్ చెక్ చేశారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఆయనతోపాటు ఏపీవో పుష్పరాజ్, టీఏ హనుమంతరావులు ఉన్నారు.

10న ఆలయ వార్షికోత్సవం

యడ్లపాడు: మండలంలోని కొత్త సొలస గ్రామంలోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయం 17వ వార్షికోత్సవం ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కిలారు కుప్పుస్వామి గురువారం తెలిపారు. సోమవారం వేకువజాము నుంచే ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు మొదలు అవుతాయన్నారు. ఆలయ అర్చకులు నారాయణం లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో పూజలు జరుగుతాయని తెలిపారు.

పాత బస్‌షెల్టర్ పరిశీలన



గ్రామ నాయకులతో మాట్లాడుతున్న డీఎస్పీ నాగేశ్వరరావు

నాదెండ్ల: జాతీయ రహదారిపై గణపవరం వద్ద ఉన్న పాత బస్‌షెల్టర్‌ను నరసరావుపేట డీఎస్పీ కె. నాగేశ్వరరావు గురువారం పరిశీలించారు. సుమారు పదేళ్ల క్రితం పండరీపురం రోటరీ క్లబ్, ధనలక్ష్మీ గ్రూపు సంస్థల సౌజన్యంతో సాదినేని చౌదరయ్య జ్ఞాపకార్థం బస్‌షెల్టర్ నిర్మించారు. ఆర్టీసీ బస్సులు నిలపకుండా ప్రధాన కూడలిలో ఆపుతున్నారు. ప్రస్తుతం గణపవరం ఆర్చి పక్కన బస్‌షెల్టర్‌ను గ్రామ నాయకులు నిర్మిస్తున్నారు. దీంతో పాత బస్‌షెల్టర్‌ను వినియోగంపై చర్చ వచ్చింది. దీన్ని పోలీస్ ఔట్‌పోస్టుగా నిర్మించాలని భావిస్తున్నారు. డీఎస్పీ నాగేశ్వరరావు పాత బస్‌షెల్టర్‌ను పరిశీలించారు. ఔట్‌పోస్ట్ నిర్మిస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉండదన్నారు. ప్రస్తుతం నిర్మించనున్న బస్‌షెల్టర్ పైభాగంలో అదనంగా గదిని నిర్మించి పోలీసులకు అందిస్తే ఉపయోగకరం అని సూచించారు.
దీనికి పోలీసు శాఖ నుంచి మైక్, సామగ్రిని సమకూరుస్తామన్నారు. ఆయన వెంట గ్రామ నాయకులు కెల్లంపల్లి అచ్చయ్య, కంచర్ల శ్రీనివాసరావు, నన్నపనేని శ్రీనివాసరావు, కాట్రు శ్రీనివాసరావు, కృష్ణారావు, సింగయ్య, ఎస్సై పుల్లారావు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు



ఉత్తమ రైతును సత్కరిస్తున్న ఎంపీపీ, అధికారులు

శావల్యాపురం: ప్రతి రైతు సేంద్రియ సాగు చేయాలని ఎంపీపీ మేడం జయరామిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. స్వయం సహాయక సంఘం సభ్యులు ప్రకృతి వ్యవసాయంపై గ్రామాల్లోని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నవధాన్యం సాగు చేసిన ఉత్తమ రైతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా రీసోర్స్ పర్సన్ సైదయ్య, ఏవో సుగుణాబేగం, ఏపీవో ఆంజనేయరాజు, సెర్ప్ ఏపీయం రామాంజనేయులు, మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ వన్నెపు తిరుపతిరావు, సీసీలు కొండలు, హనుమంతరావు, సుబ్బారావు, బ్రహ్మయ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బేబిరాణి, శివలక్ష్మి, ఒర్సు లక్ష్మిదుర్గ, కోటేశ్వరరావు, పాల్గొన్నారు.

ఇనాం భూములు రీసర్వే ప్రారంభం



మ్యాప్‌ను చూపిస్తున్న రెవెన్యూ అధికారులు

ఈపూరు (శావల్యాపురం): మండలంలోని అంగలూరు గ్రామంలో ఇనాం భూములు రీసర్వే పనులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల సర్వేయర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు గ్రామ పరిధిలో 1,264 ఎకరాలు ఇనాం భూములు ఉండగా వోఆర్ఐ మ్యాప్‌లు ఆధారంగా నాలుగు సరిహద్దులను గుర్తించి పనులు చేపట్టామన్నారు. గ్రామంలోని బ్లాక్ సర్వే నంబర్లు గుర్తిస్తామని తెలిపారు. పదిరోజుల వ్యవధిలో పనులన్నీ పూర్తి చేస్తామన్నారు. రైతుల సమక్షంలో రీసర్వే పనులు జరుగుతాయని పేర్కొన్నారు. తొలిరోజు గ్రామసరిహద్దు వోఆర్ఐ మ్యాప్‌ను గ్రామస్తులు సమక్షంలో పరిశీలించారు. వీఆర్వో కాకానబోయిన వెంకటేశ్, సర్వేయర్ కిరణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

సర్వే పారదర్శకంగా చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం: ప్రతి కుటుంబం వివరాలు, సమగ్ర స్థితిగతులపై సర్వే పారదర్శకంగా చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీ 4 సర్వేపై సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో 15 గ్రామపంచాయతీలు ఉన్నాయన్నారు. 13,182 నివాస గృహాలలో క్లస్టర్లవారీగా సర్వే ఈ నెల 8 నుంచి 18వ తేదీ వరకు పూర్తి చేయాలన్నారు. 21 నుంచి 25వ తేదీ వరకు పంచాయతీలవారీగా గ్రామ సభలు జరుగుతాయని తెలిపారు. సమావేశంలో ఎంఈవో మద్దికుంట సాంబశివరావు, ఏపీఎం జి.వాసుబాబు పాల్గొన్నారు.

ఉద్యోగినులకు ఆటల పోటీలు

నరసరావుపేట రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి వీటిని ప్రారంభించారు. లెమన్ అండ్ స్పూన్, టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్, పింకి పాంకి తదితర ఆటలను ఆడించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాలు, ఎంపీడీవో కార్యాలయం, ఉపాధి హామీ కార్యాలయంలోని మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సమానత్వాన్ని చాటుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఈ సందర్భంగా ఎంపీడీవో తెలిపారు.

రొంపిచర్ల: మహిళలు అన్ని రంగాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని ఏపీఎం సోమశేఖర్ అన్నారు. డ్వాక్రా మహిళలకు గురువారం ఆటల పోటీలు ప్రారంభించి మాట్లాడారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మహిళలకు టేబుల్ స్పూన్, మ్యూజికల్ చైర్ తదితర ఆటలు నిర్వహించారు.

కుటుంబసభ్యులపై యువకుడి దాడి

చిలకలూరిపేట టౌన్: తండ్రితోపాటు తల్లి, చెల్లి, పిన్నిపై ఓ యువకుడు దాడి చేసిన ఘటన పట్టణంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నాదెండ్ల మండల గణపవరం గ్రామానికి చెందిన గనిపిశెట్టి కృష్ణారావు కుటుంబం కొంతకాలంగా చిలకలూరిపేట పట్టణంలోని రజకకాలనీలో నివాసం ఉంటోంది. ఒక కుమారుడిని ఉన్నత విద్య నిమిత్తం అమెరికాకు పంపించగా, కుమార్తెకు వివాహం చేశాడు. మరో కుమారుడు మాత్రం ఖాళీగా ఉంటున్నాడు. డబ్బులు ఇవ్వాలంటూ కుటుంబ సభ్యుల్ని తరచు విసిగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులు పట్టణంలోని భాస్కర్‌సెంటర్లో ఉన్న ఓ టింబర్ డిపో వద్ద గురువారం పెద్దలతో పంచాయతీ ఏర్పాటు చేశారు. కుటుంబ సభ్యులంతా కలిసి పెద్దలతో మాట్లాడుతుండగానే బ్లేడుతో వచ్చిన మణికుమార్ తండ్రి కృష్ణారావుతో పాటు చెల్లి, పిన్ని, సమీప బంధువు పోతురాజు హరీష్‌లపై దాడి చేసి గాయపరిచాడు. బాధితులను పట్టణంలోని ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పాపురంలో పది మందిపై కేసు

నాదెండ్ల: కోటప్పకొండ వద్ద జరిగిన ఘర్షణలో ఓ మీడియా చానల్ కెమేరామెన్‌కు గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని నరసరావుపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిబ్రవరి 26న శివరాత్రి సందర్భంగా కోటప్పకొండ వద్ద అప్పాపురం గ్రామప్రభ ఏర్పాటు చేశారు. కాకుమాను మండలం కొమ్మూరు పంచాయతీ శివారు పెద్దివారిపాలెం గ్రామానికి చెందిన నల్లమోతు గోపి హైదరాబాద్‌లో మీడియా చానల్‌లో కెమేరామెన్‌గా పనిచేస్తుంటాడు. శివరాత్రి రోజున స్నేహితులతో కలిసి కోటప్పకొండ వద్ద ప్రభలను తిలకించేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో గ్రామస్తులు అతడిపై చిన్న విషయానికే దాడి చేశారు. గాయాలపాలైన గోపీని గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నరసరావుపేట రూరల్ ఎస్సై కిషోర్ ఆధ్వర్యంలో అప్పాపురం గ్రామానికి చెందిన పది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గంగినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సింగంశెట్టి అన్నపూర్ణమ్మ ఈ మేరకు తెలిపారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగినేని రాఘవ మాట్లాడుతూ విద్యార్థులు ఈ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యు.చంద్రజిత్ యాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు మృతి



కల్లం కృష్ణారెడ్డి (ఫైల్)

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కల్లం కృష్ణారెడ్డి(93) అనారోగ్యంతో గుంటూరులో గురువారం మృతి చెందారు. ఆయన 38 సంవత్సరాల పాటు ఉపాధ్యాయ వృత్తిలో ఉండి ఎందరినో తీర్చిదిద్దారు. పేద విద్యార్థులకు సొంత ఖర్చుతో పుస్తకాలు కొనిపెట్టారు. ఆయన శిష్యులు పలువురు ఉన్నత స్థానాలలో ఉన్నారు. విషయం తెలియగానే ఆయన మృతదేహానికి నివాళి అర్పించేందుకు ప్రత్యేక వాహనాల్లో గుంటూరు బయలుదేరి వెళ్లారు.

నేడు పీ-4 విధానంపై శిక్షణ

మాచవరం: పేదరికంలో దిగువనున్న 20 శాతం కుటుంబాలు ఆర్థిక ప్రమాణాలు, సామాజిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు నిమిత్తం పీ-4 సర్వే చేపట్టేందుకు సచివాలయ సిబ్బందికి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంగళరావు తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు



నరసరావుపేట: పట్టణంలోని వాణిజ్యసముదాయాలు, రహదారుల వెంట చెత్తవేయకుండా నిత్యం శుభ్రంగా ఉంచాలని, లేదంటే సంబంధిత వ్యాపారులపై చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు హెచ్చరించారు. గురువారం పట్టణంలోని రెండో డివిజన్ పరిధిలో పారిశుద్ధ్య పనుల తీరును పరిశీలించారు. 18వ వార్డు అరండల్‌పేట బంగారం షాపుల సమీపంలో పారిశుద్ధ్య కార్మికులు ఇద్దరు కూర్చొని ఉండటాన్ని గమనించి ఒకరోజు జీతం ఆపాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. పాత ఎల్ఐసీ రోడ్డులోని బేకరీ, ఏటీఎం, హాస్పిటల్ ఎదుట చెత్త పేరుకుపోయి ఉండటాన్ని గమనించి వెంటనే తొలగించాల్సిందిగా సూచించారు. వార్డులో పర్యటించాల్సిన పర్యావరణ కార్యదర్శి ఆంజనేయులు సచివాలయంలోనే ఉండటాన్ని గమనించారు. దీంతో ఆంజనేయులుకు షోకాజ్ నోటీసు ఇచ్చారు.

పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న వివిధ పార్టీలు, రైతు సంఘాల నాయకులు

చిలకలూరిపేట: బర్లీ పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహనరావు కోరారు. గురువారం సీపీఐ కార్యాలయంలో వివిధ పార్టీలు, రైతు సంఘాల నాయకులు, ప్రజాసంఘాల ప్రతనిధుల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముందుగా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజమోహనరావు మాట్లాడుతూ.. గత సంవత్సరం పొగాకు ధరలు బాగా ఉండటంతో రైతులు విస్తారంగా బర్లీ పొగాకు సాగు చేశారని చెప్పారు. ధరలు తీవ్ర నిరాశకు గురిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెట్ మాయాజాలం వలన ఎందరో రైతులు బలవుతున్నారని వివరించారు. గత సంవత్సరం మొదటి విరుపు తర్వాత అమ్మితే రూ. 8 వేల నుంచి రూ. 10వేల వరకు కొన్నారని గుర్తుచేశారు. ఈ ఏడాది రూ. 4 వేల నుంచి రూ.5 వేలకే ధర పరిమితమైందన్నారు. పొగాకు ధరలు ఇంకా పడిపోతాయని చెబుతున్న వారు, సిగరెట్, బీడీ ధరలు తగ్గలేదన్న విషయం గమనించాలన్నారు. బర్లీ పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో శాంతియుత నిరసనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.రాధాకృష్ణ, నవతరం పార్టీ అధ్యక్షుడు రావు సుబ్రమణ్యం, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని, జనక్రాంతి పార్టీ అధ్యక్షుడు షేక్ గౌస్, రైతు సంఘం నాయకులు కోలా నవజ్యోతి, చంద్రా కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదివితే మంచి ఫలితాలు



సామగ్రి పంపిణీ చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

చిలకలూరిపేట: ఏకాగ్రతతో చదివి పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలను విద్యార్థులు సాధించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మేకపోతుల నాగేశ్వరరావు చెప్పారు. మండలంలోని పోతవరంలో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో, రాజాపేటలో ఉన్న ఏపీ బాలుర గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పరీక్షా అట్టలు, పెన్నులు వంటి విద్యా సామాగ్రి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థి దశలో తొలి మెట్టు వంటిదని, ఇష్టంగా చదివితే మంచి ఫలితాలు సాధ్యమన్నారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎం. తనుష్, కె.లిఖిత్, డి.హేమంత్‌కుమార్, ఎం.మధు, ఎస్.యాసిన్ పాల్గొన్నారు.

కళాశాలలో రక్తదాన శిబిరం



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న చైర్మన్ ఎంవీ శేషగిరిరావు

నరసరావుపేట రూరల్: నేషనల్ ఫార్మసీ ఎడ్యుకేషన్ డే సందర్భంగా ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్, ఏరియా వైద్యశాల బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో శిబిరం జరిగింది. ప్రారంభ కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ కె.ఏడుకొండలు, మెడికల్ ఆఫీసర్ బ్లడ్ సెంటర్ డాక్టర్ కె.రామేశ్వరి, కళాశాల చైర్మన్ ఎంవీ శేషగిరిరావు, డైరక్టర్ దరువూరి శ్రావ్యలు పాల్గొన్నారు. విద్యార్థులు 40 యూనిట్ల రక్తం దానంగా ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ప్రసాదరావు, స్టాఫ్ నర్స్ బి.నాగరాజా, జి.శ్రీనివాస్, ఎస్.వర్మ, ఐక్యూ కోఆర్డినేటర్ డాక్టర్ బి.రవితేజ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చేగు కార్తిక్ పాల్గొన్నారు.

ఘనంగా కల్చరల్ ఫెస్ట్



సాంస్కృతిక కార్యక్రమంలో చిన్నారులు

వినుకొండ: పట్టణంలోని గీతాంజలి రెసిడెన్షియల్ క్యాంపస్, నెక్ట్స్ జెన్ కిడ్స్‌నందు ఘనంగా కల్చరల్ ఫెస్ట్ వేడుకలు నిర్వహించారు. చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాల్లో సందడి చేశారు. గీతాంజలి విద్యా సంస్థల వ్యవస్థాపకులు ఎండ్లూరి శేషగిరిరావు ముఖ్యఅతిథిగా వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారులు విద్యతోపాటు ఇతర రంగాలలో రాణించాలని సూచించారు. శారీరక దృఢత్వం కలిగించే ఆటలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. చిన్నారులు కూడా ఆటపాటలతో ఒత్తిడి తొలగించుకోవాలని కోరారు. ప్రిన్సిపల్ టి.కృష్ణవేణి, కరస్పాండెంట్ వై.కిషోర్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.